

# అంకుల్ సామ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

***రచనాకాలం: 1995 సంవత్సరం***

*(గత సంచిక తరువాయి)*

**"అదేం?"** ఆమె అత్తయ్య అడిగింది.

"నేను బయలుదేరాక ఇప్పటిదాకా, చెప్పడానికి ఎలాంటి విశేషాలూ జరగలేదు" చెప్పింది వాణి ముక్తసరిగా.

మర్నాడు రైల్లో రాజమండ్రికి బయలుదేరింది.

అమెరికాలో పుట్టిపెరిగిన వాణికి ఇండియా మీద వున్న అభిప్రాయం మరికాస్త అలపడింది.

ఎక్కడ చూసినా జనం. ఎవరికి సాటి మనిషి మీద ఎలాంటి మర్యాద, గౌరవ లేకపోవడం, అశుభ్రత, క్రమశిక్షణ కాని, సివిక్‌సెన్స్ కాని లేకపోవడం.

అమెరికాలో ప్రతి మనిషి అపరిచితుడిని చూసినా చిరునవ్వుతో విష్ చేస్తాడు.

ఎవరి మొహంలో చికాకు, కోపం ఉండవు. కాని ఇండియాలో ప్రతి మనిషి ఫ్రస్టేషన్ అతని మొహంలో, చర్యల్లో వ్యక్తం అవుతూ ఉంటుంది.

ప్రతి మనిషీ ఓ రగులుతున్న అగ్నిగుండం.

ఓ మనిషి ఇంకో మనిషి మీద కోపంతో విరుచుకు పడటానికి చిన్న కారణం చాలు.

రైలు నాలుగు గంటలు ఆలస్యంగా చేరింది రాజమండ్రికి. వాణి తాతయ్య శివయ్య మనవరాల్ని తీసుకెళ్ళటానికి స్టేషన్ కొచ్చాడు.

జెట్‌లాగ్ హైదరాబాద్‌లోనే తీరిపోయింది వాణికి. కాబట్టి రైలు దిగేసరికి ఫ్రెష్‌గా వుంది.

ఆయన ఏర్పాటు చేసిన టాక్సీలో రాజమండ్రికి కొద్ది దూరంలో ఉన్న పల్లెటూరు చేరుకున్నారు.

వాణి భోజనం చేశాక శివయ్య చెప్పాడు వాణితో.

"నిన్నిక్కడే ఉంచి చదివించమని ఫోన్‌లో చెప్పాడు మీ నాన్న!"

"అవును. అందుకే నన్ను పంపించింది" చెప్పింది వాణి.

"నీ కిష్టమేగా ఇక్కడుండి చదువుకోడానికి?"

"నీ దగ్గర ఉండటం ఇష్టమే తాతయ్యా! కానీ ఇండియాలో ఉండటం నాకిష్టంలేదు" చెప్పింది వాణి.

"అదేం?"

"దోమలు, బురద, గుంటల రోడ్లు, పేడ – షిట్ వీటిమధ్య పుట్టి పెరిగారు మీరు. కాబట్టి ఇవేవీ మిమ్మల్ని బాధించవు. అవి మీ జీవితంలో ఓ భాగం. కాని నేను పెరిగిన దేశం శుభ్రతకు మారుపేరు"

"అవునట విన్నాను" చెప్పిందా అమ్మాయి.

శివయ్య మనవరాలు అమెరికానుంచి వస్తోందని ఊరంతా తెలిసిపోయింది కాబట్టి సాయంత్రం చాలామంది వచ్చారు వాణిని చూడటానికి.

ముందురోజు రాత్రే వాళ్ళు టూరింగ్ టాకీస్‌లో 'సీతారామయ్యగారి మనవరాలు' సినిమా చూశారు కాబట్టి ఆ సినిమాలో మీనాలా వాణి సెంటిమెంటల్‌గా ఉంటుందని భావించారు.

"నీకు చదరంగం వచ్చా?" అడిగారొకరు.

"వచ్చు."

"మీ తాతయ్యకీ వచ్చు, ఆడు చూద్దాం"

"తర్వాత ఆడతాన్లెండి"

"తాతయ్యా! పందెం లేకుండా నేను ఆడను. నే గెలిస్తేనువ్వు నన్ను ముద్దు పెట్టుకోవాలి. నే ఓడిపోతే నేను నిన్ను ముద్దు పెట్టుకుంటాను అనలేదు" ఆ సినిమాలోని అమ్మాయికీ, వాణికీ అసలు ప్రవర్తనలో పోలికే లేదు.

'అశోకవనమున సీత' అన్న తీరులో రాక్షసమూక మధ్యకు వచ్చినట్లుగా దిగులుగా కనిపించింది వాణి.

ఆ రాత్రి వేంకటేశ్వరరావు కూతురుతో మాట్లాడడానికి ఫోన్ చేశాడు.

వాణి తన తండ్రితో మాట్లాడలేదు.

"విశేషాలేమీ లేవని చెప్పండి తాతయ్యా" చెప్పింది.

"ఓసారి మాట్లాడమంటున్నాడు" అని ఆయన చెబితే "నాకిష్టం లేదన్నానని చెప్పండి" అని నిక్కచ్చిగా సమాధానం చెప్పింది.

వారం పాటు ఎంతో అవస్థపడిద్మి వాణి.

రోజూ పాకీవాడు వచ్చి శుభ్రం చేసే, ఇసుకపోసి రెండు సిమెంట్‌రాళ్ళు కూర్చోడానికి ఉంచే ఆ పాకీ దొడ్డిని ఉపయోగించడం ఓ నరకంగా వుంది వాణికి.

"అదే అలవాటవుతుందిలే" చెప్పాడు శివయ్య వాణి ఫిర్యాదు చేస్తే.

మళ్ళీ శనివారం తన తండ్రి ఫోన్ చేస్తే ఇసారి వాణి మాట్లాడింది తండ్రితో.

"ఎలా ఉన్నావ్?" అడిగాడాయన.

"నాకిక్కడ లెట్రిన్ నచ్చలేదు డాడీ" చెప్పింది వాణి.

"ఏమంటున్నావ్?"

"లెట్రిన్ నచ్చలేదంటున్నాను. అమెరికా వచ్చేస్తాను." ఏడుపును ఆపుకుంటూ చెప్పింది.

కూతురితో మాట్లాడటానికి వెంకటేశ్వరరావు భార్య లక్ష్మి రిసీవర్ అందుకుని అడిగింది –

"ఏమ్మా? ఎలా ఉన్నావ్? భోజనంలో కారాలు తగ్గించమని సంగీతతో చెప్పాను. అంతా బాగానే వుందా?"

"ఇటీజ్ సచే రాటన్, డర్టీ లెట్రిన్ మమ్మీ!"

"ఏమిటీ?"

"ఐ కాంట్ బిలీవ్ పీపుల్ యాక్చువల్లీ క్లీనిట్. ఇట్స్ లివింగ్ హెల్ టు బి ఎ పార్ట్ ఆఫ్ దట్ డర్టీ ప్లేస్" ఫోన్ పెట్టేసింది వాణి ఏడుస్తూ.

రవి అడిగాడు తల్లిని వాణి ఏం మాట్లాడిందని.

''ఇండియన్ లెట్రిన్స్ గురించి'' చెప్పిందామె.

''లెట్రిన్ గురించా?'' ఆశ్చర్యంగా అడిగాడు రవి.

తర్వాత ఫకాలున నవ్వి చెప్పాడు.

''షి ఈజ్ మేకింగ్ ఫన్. ఈన్టు షి?''

వెంకటేశ్వరరావు ఇండియా వచ్చినప్పుడు రాజమండ్రి హోటల్‌లో గది తీసుకుని వుండి, టాక్సీలో తన స్వగ్రామం వెళ్ళేవాడు కాబట్టి వాళ్ళకి ఎప్పుడూ లెట్రిన్ ప్రాబ్లమ్ రాలేదు.

మళ్ళీ వారానికి సెప్టిక్ టాంక్స్ గురించి తెలిసింది వాణికి. ఈసారి తండ్రిని డబ్బు పంపించమంది. అలాంటి సెప్టిక్ లెట్రిన్ కట్టించడానికి.

వాణికి అక్కడి మనుషులూ, వాళ్ళు చూపించే ఆప్యాయతా కొంతవరకు నచ్చింది. లేకపోతే పిచ్చెక్కిపోయేదే వారం తర్వాత జూనియర్ కాలేజీలో చేర్పించాడు వాణిని. ఆమె చేరిన నాలుగోరోజు అమెరికా నుంచి ఉత్తరం వచ్చింది.

వాణి జూడీకి, సుసాన్‌కి రాసిన ఔత్తరాలకి ఇద్దరు చెరో కాగితం మీదా సమాధానం రాసి పోస్ట్ చేశారు. వాళ్ళ స్కూలు విశేషాలు రాశారు.

మర్నాడు ఇంకో ఉత్తరం వచ్చింది అమెరికా నుంచి. అది స్టేన్లీనుంచి.

ఫ్రాంక్‌ఫర్ట్ ఎయిర్‌పోర్ట్ నుంచి వాణి పంపిన 'నేషనల్ ఎంక్వయిరర్' మేగజైన్‌లోని పేపర్ క్లిప్పింగ్‌ని తిప్పిపంపించాడు. వాణి దానిమీద రాసిన మేటర్ కింద ఒకే ఒక వాక్యం రాసి పోస్ట్ చేశాడు.

''సగటు అమెరికన్ పెళ్ళి కూతురు గౌనుకు చేసే ఖర్చుకన్నా నీకు రెట్టింపు ఖర్చయ్యే గౌనుని కొంటాను. ఐ మిస్ యు ఎ లాట్.

లవ్

స్టేన్లీ''

వాణి ఆ రోజే స్టేన్లీకి సమాధానం రాసింది వాణికి ఆ నెల పీరియడ్ అయిందని ఇతెలిసాక శివయ్య మనస్సు శాంతించింది. అంతదాకా ఆయనకి ఆదుర్దాగానే వుంది తన మనవరాలు అమెరికాలో నెలతప్పిందేమోనని. శివయ్య నుంచి ఏదో దాచకుండా, స్టేన్లీ గురించి ఫోన్‌లో వెంకటేశ్వరరావు మొత్తం చెప్పడంతో ఆయనకి ఆ భయం పట్టుకుంది.

## 10

రోజులు గడిచేకొద్దీ వాణి క్రమంగా ఇండియన్ వాతావరణానికి అడ్జస్ట్ కాసాగింది రోజూ బస్సులో రాజమండ్రి వెళ్ళివస్తోంది.

పదిహేనో ఏడు వస్తే కాని జూనియర్ కాలేజీలో చేర్చుకోరు. కాని పధ్నాలుగేళ్ళ వాణిని చేర్చుకున్నారు. హై రికమండేషన్ మీద.

తోటి అమ్మాయిలు, అబ్బాయిల ప్రవర్తన ద్వారా ఎంతో నేర్చుకుంది వాణి. అమెరికాలోలా వయసులో వున్న పిల్లలకి ప్రవర్తనలో స్వతంత్రం వుండదు.. ఓ అమ్మాయితో ఓ అబ్బాయికి డేటింగ్ చేసే ప్రసక్తి లేదు. కనీసం కలిసి సినిమాకి వెళ్ళడం కూడా అరుదు.

ఓణీలు వేసుకుని ఎంతో ఒద్దికగా క్లాసుకు వచ్చి, మళ్ళీ తిన్నగా ఇంటికి వెళ్ళిపోయే అమ్మాయిలని, వాళ్ళలోని పవిత్రతని చూస్తే తోటి అమెరికన్ విద్యార్థుల ప్రవర్తన గుర్తుకు వచ్చేది. యిక్కడ సెక్స్ గురించి మాట్లాడటానికే భయం. కానీ అమెరికాలో అది ఎంతో సాధారణ విషయం.

''ఇఫ్ యువర్ బెడ్ షీట్ ఈస్ స్టికీ, యు ఆర్ లక్కీ''

''నథింగ్ ఈజ్ బెటర్ ఫర్ ఏ కోల్డ్‌మేన్ దేన్ ఏ హాట్ గర్ల్!''

ఈ రకం వ్యాఖ్యానాలు తను చదివిన స్కూల్లోని తోటి విద్యార్థినుల నోటివెంట ఎన్నోసార్లు విన్నది. కానీ రాజమండ్రిలో ఆ ధ్యాసేలేదు. చదువు చదువు చదువు. సెక్స్ అనే విషయమే నిషేధం.

"సినిమాకి వెళదామా?" అని ఓ అబ్బాయి ఎవరయినా అమ్మాయిని అడిగితే వాళ్ళు పోకిరీ అబ్బాయిల కింద లెక్క. లేదా నడుస్తుంటే సైకిలు అడ్డం పెడితే వాడు రౌడీ కింద లెక్క. అంతే తప్ప సెక్సువల్ ఇంటర్ కోర్స్ అనేది పెళ్ళికాని యువతీయువకుల మధ్యసాధ్యం, అరుదు అన్న విషయం గ్రహించిన వాణికి ఆ పద్ధతి ఎంతో నచ్చింది.

అది అనుభవంలోకి రాకపోవడంతో, దానిమీద అందరికీ శోభనం గదిలోకి వెళ్ళేదాకా ఆసక్తి వుంటుంది.

ఇలాంటి పరిస్థితుల్లో ముకుందం వాణికి పరిచయమయ్యాడు. అతనికి తన మీద ప్రత్యేకమైన ఆసక్తి వుండటానికి కారణం తను అమెరికా నుంచి రావడం అనుకుంది తప్ప, తనంటే అతనికి కలిగిన ఆకర్షణ అని భావించలేదు వాణి కొంతకాలం దాకా.

స్టేన్లీ నుంచి ఉత్తరాలు వస్తునే ఉన్నాయి. వాటిని ఎవరికంటా పడకుండా దాస్తోంది వాణి.

★★★★★

వాణి ఇండియా వచ్చి తొమ్మిది నెలలైంది. ఈ తొమ్మిది నెలల్లో కనీసం నూట ఏభయ్ సాయంత్రాలు వాణి ముకుందంతో చదరంగం ఆడింది.

ఈ కాలంలో వాణికి ఇండియాకి, అమెరికాకి స్థూలంగా గల ఎన్నో తేడాలు అవగతం అయ్యాయి. అమెరికా గురించి ముకుందానికి అట్టే ఆసక్తిలేదు కానీ, అతని స్నేహితుడు బాపన్నకి ఎంతో ఆసక్తి పోస్ట్ గ్రాడ్యుయేట్ చేశాక అమెరికా వెళ్ళి ఎం.బి.ఏ చేయాలన్నది బాపన్న కల. అతని బంధువులు కొందరు అక్కడ స్థిరపడ్డారు.

సాయంత్రాలు ఏ గోదావరి బ్రిడ్జిమీదికో చేరుకునేవారు. అమెరికా గురించి అడిగితే చెపుతుంది వాణి.

"ఎకడమిక్ కోర్స్ ఇక్కడలా కాదు. మాకక్కడ పదివారాలు కలిపిన టెర్మ్‌లు నాలుగుంటాయి. ప్రతి ఎకడమిక్ ఇయర్‌కి. ఆ టెర్మ్‌లని సెమిస్టర్ అని, లేదా క్వార్టర్ అని పిలుస్తారు. ఇక్కడ మార్కులుంటాయి కానీ, అమెరికాలో అలాకాదు. క్రెడిట్స్ అనే యూనిట్స్‌లో పెర్‌ఫామెన్స్‌ని లెక్కవేస్తారు. ప్రతి కోర్సుకి రెండు నుంచి అయిదు క్రెడిట్స్ ఉంటాయి. గ్రాడ్యుయేట్ అవడానికి క్వార్టర్ యూనిట్స్ అయితే నూట ఎనభై, అదే సెమిస్టర్ అయితే నూట ఇరవై సెమిస్టర్ యూనిట్స్ కావాలి.

"స్కూల్, కాలేజీల్లోని వాతావరణం ఇక్కడున్నంత డిసిప్లిన్డ్‌గా ఉండదు. ఎంతో కేజువల్‌గా ఉంటుంది. స్టూడెంట్స్ క్లాసులో సిగరెట్స్ తాగుతారు. లెక్చరర్‌ని ఓ ఫ్రెండ్‌లా ట్రీట్ చేస్తారు తప్ప ఇక్కడలా గౌరవం భక్తి ఉండవు.

"ముఖ్యంగా చదువుమీద ఇక్కడ స్టూడెంట్స్‌కు ఉన్నంత పట్టుదల, శ్రద్ధ, పోటీ అమెరికాలో ఉండవు. డ్రాపవుట్స్ ఎక్కువ."

"డ్రాపవుట్స్ అంటే?" అడిగాడు బాపన్న.

"స్కూలు ఎడ్యుకేషన్ పూర్తిచేయకుండా మధ్యలో స్కూల్ మానేసేవాళ్ళని డ్రాపవుట్స్ అంటారు. ఇండియాలో ఉద్యోగావకాశాలు తక్కువ, పోటీ ఎక్కువ. అందుచేత ఉద్యోగం రావాలంటే ఎక్కువ మెరిట్, క్వాలిఫికేషన్ ఇక్కడ అవసరం కాబట్టి కష్టపడి చదువుతారు. కానీ అమెరికాలో ఈ సమస్యలేదు. గంటసేపు పనిచేస్తే ఎనిమిది నుంచి పది డాలర్ల అదాకా సంపాయించుకోవచ్చు. పెట్రోల్ బంకుల్లో, హోటల్స్‌లో వెయిటర్స్‌గా, సూపర్ మార్కెట్లలో ఒసేల్స్‌మెన్‌గా యిలా, ఇక్కడ విద్యార్థులకి చదువు ఓ పరమావధి. కానీ అమెరికాలో చదువే జీవితం కాదు. జీవితంలో ఓ చిన్న భాగం అది. కష్టపడి పై చదువులు చదివి ఇతరులతో పోటీపడాలన్న అవసరం అక్కడ లేదు. పైగా నైట్‌క్లబ్స్, బార్స్, డ్రగ్స్, టీ.వీ.లాంటి వినోదాలెక్కువ. వాటికి టెంప్ట్ అయి చదువాపేసి, ఆడ్‌జాబ్స్ చేసుకుంటూ, ఆ విలాసాల్లో మునిగితేలుతుంటారు కొందరు. ఇక్కడ ఇంటర్‌మీడియట్‌లో చదువాపేస్తే ఉద్యోగం రావడం, బ్రతకడం కష్టం. అమెరికాలో నైన్తులో చదువాపేసినా హాయిగా బ్రతకొచ్చు. చదువులో మెయిన్‌గా నాకు కనపడ్డ తేడా యిది."

"అంటే మన ఇండియన్స్ అమెరికన్స్ మీద హార్డ్ వర్కింగ్ అన్నమాట" అడిగాడు ముకుందం.

"ముమ్మాటికీ హార్డ్ వర్కింగ్ అండ్ ఇంటెలిజెంట్. ఓ ఏవరేజ్ అమెరికన్‌తో పోలిస్తే ఓ ఏవరేజ్ ఇండియన్ ఎంతో తెలివిగలవాడు. దానికి కారణం మళ్ళీ ఇక్కడి పరిస్థితులే. అమెరికాలో మామూలు జీవితంలో నీతి, నిజాయితీ ఎక్కువ. ఓ కార్పెంటర్ మనింటికి వచ్చి పని చేస్తే మన పని ఫలానా టైముకి పూర్తిచేస్తానంటే నిజాయితీగా, శ్రద్ధగా అలా పూర్తిచేసి వెళతాడు. అదే ఇక్కడయితే ఇంకో పని దొరికితే సగంలో మనది ఆపి, దానికి వెళతాడు. ఇదెక్కడికీ పోదని వాడలా చేస్తాడు. కాబట్టి వాడికివ్వాల్సిన డబ్బు తొక్కిపెట్టాలనుకుంటారు సహజంగా. డబ్బు తొరిఇఈఐ ఇపెడతారని తెలుసు కాబట్టి ఎలా వసూలు చేయాలా అని ఆలోచిస్తాడు ఆ కార్పెంటర్. ఇలాంటి చదరంగంలాంటి జీవితాలు ఇక్కడ. ఈ విధమైన బ్రెయిన్ ఎక్సర్‌సైజ్ వల్ల ఇండియన్స్‌కి ఇంటెలిజెన్స్ అధికం. 'ఎదుటివాడిని ఎలా మోసం చేయాలి, ఎదుటివాడు ఏ మోసం ఎలా చేస్తాడు, దాన్నుంచి మనల్ని మనం ఎలా కాపాడుకోవాలి' ఈ మూడూ ప్రతి ఇండియన్ జీవితంలో ఓ భాగం కాబట్టి బ్రెయిన్ వర్క్ ఎక్కువ. కానీ అమెరికాలో ఈ రకం మోసాలు, మనిషిని మనిషి దోచుకోవడం ఉండదు. కాబట్టి అక్కడ ఈ రకమయిన బ్రెయిన్ వర్క్‌వుండదు. ఈ కారణంగా ఏవరేజ్ ఇండియన్ ఏవరేజ్ అమెరికన్ కన్నా ఇంటెలిజెంట్."

"హార్డ్ వర్కింగ్ అని కూడా అన్నావు?"

"హార్డ్ వర్కింగ్ కూడా . అమెరికలో కరిక్యులం, ఇండియన్ కరిక్యులంతో పోలిస్తే ఎంతో తేలిక. ఇక్కడున్నంత కోర్స్ వుండదు. సెమిస్టర్ విధానం కాబట్టి ఓసారి పరీక్ష రాశాక చదివింది మరిచిపోవచ్చు. స్కూలు విద్యార్థి ఇక్కడ చదువుకి ఉపయోగించినన్ని గంటలు అమెరికాలో ఏ విద్యార్థీ వినియోగించడు. అనేక చానెల్స్‌లో వచ్చే టీ.వీ వీకెండ్ పిక్నిక్స్, సినిమాలులాంటి ఎన్నో వినోదాలకి కూడా అక్కడ స్టూడెంట్స్ టైమును కేటాయిస్తారు. మొన్నటిదాకా మనకి టీవీలేదు. నిన్నటిదాకా ఇన్ని ఛానెల్స్ లేవు. నెలకో సినిమా, చదువు తప్పితే ఇంకో వ్యాపకం ఉండేది కాదు మనకి. అందుచేత చదువుకోసం టైము కేటాయిస్తే ఇంకేదో మిస్ అవుతున్నాం అనే ప్రాబ్లం ఇక్కడ లేదు. అక్కడ ట్వెల్త్ క్లాస్ దాకా స్కూల్లో చదవాలి. తర్వాత చదువంతా యూనివర్శిటీల్లోనే."

"నేను అమెరికా వచ్చి చదువుకోడానికి అవసరం వస్తే మీరు నాకు సహాయం చేస్తారా?" బాపన్న అడిగాడు వాణిని.

"డబ్బు తప్ప ఇంకే సహాయం చేయమన్నా చేస్తాను" చెప్పింది వాణి నవ్వి.

★★★★★★★

"వాణిలో చిత్రమైన ఆకర్షణ ఉందిరా" చెప్పాడు బాపన్న ముకుందంతో.

"అంటే? బాబ్డ్ హెయిర్ అనా?"

"ఉహూం ప్రవర్తనలో అమెరికాలో పుట్టి పెరగడం వల్ల అనుకుంటాను."

"వాణి నీ చెల్లెలు" గుర్తుచేశాడు ముకుందం చిరుకోపంగా.

"ఛ! ఆ ఉద్దేశంతో అనలేదు నేను."

"నాకు ఇంటర్ కోర్స్ ఎలా ఉంటుందో తెలుసుకోవాలని వుంది. వేశ్యల దగ్గరకి వెళితే ఎయిడ్స్ వస్తుందన్న భయం. వేశ్యలు కాని ఎవరూ అందుకు ఒప్పుకోరు. ఓసారికి ఒప్పుకుంటే ఏం పోతుందో?" చెప్పాడు బాపన్న ఫ్రస్టేటెడ్‌గా.

చిన్నగా నవ్వి అడిగాడు ముకుందం "ఎవర్నడిగితే ఒప్పుకో లేదు?"

"అడగడమే? ఇంకేమైనా వుందా?"

"అడక్కుండా ఎలా ఒప్పుకోవాలి అనుకుంటున్నావు?"

"నీకు తెలియదు, ఒప్పుకోరు."

"మీ నళినీ దేశ్‌పాండే ఆంటీ ఎలా వుంది? మళ్ళీ సరస్వతీ నమస్తుభ్యంలాంటి నవలలేమైనా తీసుకెళ్ళి ఇచ్చావా?" అడిగాడు ముకుందం.

"సంధ్యావందనం అనే పుస్తకం ఇచ్చాను. ఏదో మాములు నవల చదివినట్లుగా చదివి ఇచ్చేసింది. ఏం సెన్సేషన్ వుండదు."

"మొదటి మూవ్ మొగాడిదే అయి ఉండాలిట. ఐ లవ్ యూ అను."

"ఇష్టం లేకపోతే మా అమ్మా, నాన్నలతో చెపితే?"

"మీ అక్క కూతురు?"

"అది ఇంట్లో చెపితే ఇంకా డేంజర్. నళినీ ఆంటీనే మేనేజ్ చేయాలి. ఎలా అన్నది తట్టడం లేదు."

"మీ అమ్మా, నాన్నలకి చెపితే పరవలేదు. దేశ్‌పాండే అంకుల్‌కు చెపితే మాత్రం నీ వీపు విమానం మోత మోగుతుంది జాగ్రత్త."

"నళినీ ఆంటీ బావుంటుంది కదరా?" అడిగాడు బాపన్న కాసేపాగి.

"ఒప్పుకుంటే నాకెవరయినా బానే వుంటారు" చెప్పాడు ముకుందం చిన్నగా నవ్వి.

బేసిక్‌గా యవ్వనంలో మగాడి మనస్తత్వం ఎక్కడయినా ఒకటే. ఈ మనస్తత్వం వల్ల కీడు జరగకూడదని ఎన్నో కట్టుబాట్లు, సంప్రదాయాలు, సెంటిమెంట్లు ఏర్పరిచారు ఇండియాలోని పూర్వీకులు. ఇవి ఎంత బలమయిన వంటే. కొన్ని యుగాలైనా ఇంకా అలాగే కొనసాగుతున్నాయి.

కానీ అమెరికాలో పరిస్థితి వేరు. స్వేచ్ఛా ప్రణయం ఎంతగా ముదిరిపోయిందంటే ఇటీవల పాతిక వేలమంది టీనేజర్స్‌తో తమ స్వేచ్ఛా ప్రణయం మీద తమకే అసహ్యం వేసి, వాషింగ్‌టన్ డి.సిలో కన్యత్వ ప్రతిజ్ఞని చేసి, ర్యాలీ నిర్వహించారు.

బేక్ టు ది పెవిలియన్.

## 11

ఆప్యాయత బలహీనమయినదైతే దాన్ని ఆర్పేస్తుంది. వృద్ధి చేస్తుంది. వాణి వెంకటేశ్వరరావుల మధ్య వున్న బంధం బలహీనమైంది కాదు.

వాణి ఇండియా వచ్చిన కొన్ని నెలలకి వాళ్ళ మధ్య వున్న మనస్పర్థలు మటుమాయం అయ్యాయి. ప్రతి వీకెండ్‌కి కూతురితో ఓ పావుగంటైనా మాట్లాడతాడాయన. అమెరికన్ పద్ధతిలో "ఐ మిస్ యు డేడ్" అని చెపుతుంది వాణి ప్రతీసారీ.

ఓసారి సుసాన్, మరోసారి జూడీ కూడా వెంకటేశ్వరరావు ఇంటికి వచ్చి వాణితో ఫోన్‌లో మాట్లాడారు. స్కూలు విషయాలు, ఫోర్త్ ఆఫ్ జూలై ఎలా స్పెండ్ చేశారులాంటి విషయాలు మాట్లాడారు వాళ్ళు.

"ఎల్.ఏ.కి వెళ్ళాం లాస్ట్‌వీకెండ్ బ్యూనే పార్క్‌లో నాట్స్‌బెర్రీ ఫామ్‌కి వెళ్ళాం" జూడీ చెప్పింది.

నాట్స్ బెర్రీఫాం అమెరికాలోని అతి పురాతనమైన పాపులర్ థీమ్ పార్క్ అక్కడ 165కి పైగా రైడ్స్, ఇతర ఆకర్షణలు అయిదు ఏరియాల్లో ఉన్నాయి.

"ఏనీ రైడ్స్?" అడిగింది వాణి. టీనేజర్స్‌కి రైడ్స్ ఎంతో ఆసక్తిగా ఉంటాయి.

"ఓ! చాలా ఎక్సయిటింగ్ రైడ్స్ ఉన్నాయి. ఓ రోలర్ కోస్ట్ రైడ్‌కి వెళ్ళాం. దాని పేరు బూమ్‌రాంగ్. సరిగ్గా ఓ నిముషంలో మనం వెళ్ళే కార్లు ఆరుసార్లు తలకిందులవుతాయి. మూడుసార్లు వెనక్కి మూడుసార్లు ముందుకి వెళతాయి కార్స్. గంటకి యాభయ్ మైళ్ళ వేగంతో. నూట పది అడుగుల ఎత్తు నుంచి వచ్చి కిందకు దిగి ఆ టైట్‌లూప్స్‌లో గుండ్రంగా తిరుగుతుంది కార్. ఇటీస్ బోన్ చిల్లింగ్ అండ్ సర్వ్‌రేకింగ్ ఎక్స్‌పీరియన్స్. ఐ మస్ట్ సే ఇట్ వజ్ సచ్ ఏన్ ఎల్కక్ట్రిఫయింగ్ ట్రిప్."

వాణి మనసు బాధగా మూలిగింది అలాంటి ఎక్సయిటింగ్ ఫన్ తనకు అందుబాటులో లేనందుకు.

"అక్కడ ఎలా ఉందమ్మాయ్?" అడిగాడు వెంకటేశ్వరరావు ఓసారి.

"సెప్టిక్ టాంక్ కట్టించాక కాస్తంత పరవాలేదు. తాతయ్య అందరితో చెపుతున్నాడు నా మనమరాలి వల్ల ఇంటికి సెప్టిక్ టాంక్ వచ్చిందని. నువ్వు కట్టిస్తానన్నా ఇంతకాలం వద్దన్నాడటగా?"

"అవును, సెలవలకి ఇక్కడికి వస్తావా?" అడిగాడు వెంకటేశ్వరరావు.

"ఊహూ"

"పట్టుదలా?" కూతురి సంగతి తెలిసి అడిగాడు ఆయన.

ఆ మాటకి సమాధానం చెప్పలేదు వాణి. "డేడ్! నేను ఇండియన్‌నా లేక అమెరికన్‌నా అని అడిగాను ఓసారి గుర్తుందా?"

"ఇప్పుడా మాటెందుకు?"

"ఆ ప్రశ్నకి సమాధానం దొరికింది. నేను అమెరికన్‌ని. ఇండియన్‌ని కాను."

"ఎలా తెలిసింది?"

"నేను అమెరికన్స్‌లా ప్రతి నెలా పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి సంతకం చేసి వస్తున్నాను. ఇక్కడి చట్టం దృష్టిలో నేను ఫారినర్‌ని."

ఎక్కువకాలం ఇండియాలో ఉండే ప్రతి ఫారినర్ (డిప్లొమాట్స్‌లాంటి కొందరు తప్ప) తను నివసించే జ్యూరిస్ డిక్షన్‌లోని పోలీస్ స్టేషన్‌కి పీరియాడికల్‌గా వెళ్ళి సంతకం చేసి వస్తూండాలి.

"డేడీ నేను ఇండియన్‌నే అని ఫీలవుదామన్నా అలా ఫీల్‌కాకుండా చేస్తోంది ఈ ప్రొసీజర్. నాలాంటి వాళ్ళకి ఎందుకు ఎగ్జమ్షన్ ఇవ్వరు? ఇండియాలో ఉంటూ ఇండియన్ బ్లడ్ కలిగిన నేను ఇక్కడ ఫారిన్‌లా ఎందుకు చూడబడాలి?"

వెంకటేశ్వరరావు దగ్గర ఆ ప్రశ్నకి సమాధానం లేదు.

ఆ ఏడాది వాణి నైన్త్ పరీక్ష పాసై టెన్త్‌కి వచ్చింది.

సెలవల్లో శివయ్య, ఆయన కూతురు సంగీత, వాణి కలసి రాజమండ్రినుంచి బయలుదేరి వెళ్ళే టూరిస్ట్ బస్సులో దక్షిణ భారతదేశ యాత్రకి వెళ్ళొచ్చారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు - మద్రాసు, మహాబలిపురం, కంచి, పక్షితీర్థం, బెంగుళూరు, గోమతేశ్వర్, మైసూరు, ఊటీ మొదలయిన ప్రదేశాలు చూసి వస్తూంటే చెప్పింది వాణి శివయ్య సంగీతలకి -

"అమెరికాలా కాదు ఇండియా. అమెరికా మొత్తం తిరిగినా భాష, దుస్తులు, తిండి, రోడ్లులాంటివన్నీ ఒక్కలాగే ఉంటాయి. ఇక్కడ అలాకాదు. ఇళ్ళుకట్టుకునే పద్ధతి, భాష, దుస్తులు, భోజనం అన్నిట్లో ఓ రాష్ట్రానికి, ఇంకో రాష్ట్రానికి తేడానే."

"నార్త్‌కి వెళితే ఈ తేడా ఇంకా ఎక్కువగా ఉంటుంది" చెప్పాడు శివయ్య.

వాణి మద్రాసు నుంచి రోడ్డుమీద పాములు ఆడించే అతని పిక్చర్ పోస్ట్‌కార్డు, బెంగుళూర్ నుంచి విధాన సభ పిక్చర్ పోస్ట్‌కార్డు, మైసూరునుంచి బృందావన్ గార్డెన్స్ పిక్చర్ పోస్టుకార్డు అమెరికాలోని స్టేన్లీకి పంపించింది.

"విష్ యు వర్ హియర్" అని రాసింది ప్రతికార్డు మీద.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

Post your comments